
సాక్షి నల్లగొండ

శుక్రవారం, 10, అక్టోబర్, 2025



'నెల్లికల్లు' పనులు ముమ్మరం

సాగర తీరంలోని బండలక్వారీ వద్ద మూడేళ్ల క్రితం మొదలైన నెల్లికల్లు ఎత్తిపోతల పనులు ముమ్మరమయ్యాయి. - IIలో



ఏసీబీకి చిక్కిన తహసీల్దార్

చిట్యాల తహసీల్దార్ కృష్ణ ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ద్వారా లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. - IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	590 అడుగులు
ఇన్‌ఫ్లో	:	83, 491 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	83, 491 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,779 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	7,272 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	నిల్
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్మి మద్దతు పొందాలి



శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నల్లగొండ: ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాల్లోని రైతులు తమ ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. వానాకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్న నేపథ్యంలో వివిధ విభాగాల సిబ్బందికి గురువారం నల్లగొండలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఎత్తయిన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు ధాన్యం పోసిన వెంటనే వారి పేరు, సీరియల్ బుక్‌లో రిజిస్టర్ చేసి వారికి సీరియల్ నంబర్ ఇవ్వాలన్నారు. రైతుల నుంచి పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డుల జిరాక్స్‌లు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ధాన్యం తెచిచ గ్రేడ్-ఏకు రూ.2,389, సాధారణ గ్రేడ్‌కు రూ.2369, సన్న ధాన్యానికి అదనంగా రూ.500 పొందాలన్నారు. ప్రతి రైతు నుంచి ఎకరాకు 32 క్వింటాళ్ల వరి ధాన్యం మాత్రమే కొనాలన్నారు. హమాలీ చార్జి ప్రభుత్వ ధర ప్రకారం క్వింటాకు రూ.45 మాత్రమే రైతుల నుంచి ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రవణ్‌కుమార్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి, వీరయ్య, బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

నల్లగొండ: బీజేపీ చేస్తున్న ఓటు చోర్‌పై చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలోని 31వ వార్డులో ఓటు చోర్‌పై పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గురి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర, గుజరాత్‌లో కూడా బీజేపీ ఓట్ చోర్‌కు పాల్పడిందని విమర్శించారు. ఈనెల 15 వరకు సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మనిమద్దె సుమన్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



అవుల వైష్ణవి

కనగల్: మండల కేంద్రంలోని అక్కినపల్లి వెంకటేశ్వరరావు మెమోరియల్ ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న అవుల వైష్ణవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ థామసయ్య గురువారం మాట్లాడుతూ ఈ నెల 8న భువనగిరిలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో వైష్ణవి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో మహబూబాబాద్, నర్సంపేటలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-19 కబడ్డీ పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు.

గరిష్టస్థాయి వద్ద నిలకడగా సాగర్ నీటిమట్టం



నాలుగు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: సాగర్ జలాశయానికి వరద నీరు కొనసాగుతోంది. ఎగువ నుంచి సాగర్ జలాశయానికి 83,775 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాలుగు గేట్ల ద్వారా 32,400 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 34,063 క్యూసెక్కులు మొత్తం 66,463 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. అలాగే కుడి, ఎడమ కాల్వలకు 17,317 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఏఎమ్మార్పీ, వరద కాల్వలకు నీటిని నిలిపివేశారు. సాగర్ జలాశయం ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టమైన 590 అడుగులు(312.0450 టీఎంసీల) వద్ద నిలకడగా ఉంది.





వైభవంగా గంధం ఊరేగింపు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలో గురువారం సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రీ ఉర్సు ప్రారంభం సందర్భంగా ఊరేగించేందుకు గంధాన్ని తీసుకొస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఏఎస్పీ రమేష్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి, పోలీస్ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు

జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో గంధం ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు, భక్తులు

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: పాఠశాలల విద్యార్థుల సంక్షేమం, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల విద్యార్థుల భద్రత పట్ల నిర్లక్ష్యం వహించిన సహించేది లేదని పేర్కొన్నారు. గత నెల 4న నల్లగొండలోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో బస్సు కిందపడి చనిపోయిన చిన్నారి జశ్విత కేసు విషయం బాధాకరమని తెలిపారు. మాస్టర్ మైండ్స్ పాఠశాల బస్సు ఘటన విషయంలో హైకోర్టు పూర్వాపరాలను పరిశీలించి పాఠశాల యాజమాన్యంపై కొత్తగా చర్యలు తీసుకొనే స్వేచ్ఛను జిల్లా యంత్రాంగానికి ఇస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. త్వరలోనే జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ పాఠశాలలో చదివే విద్యార్థులకు నష్టం జరగకూడదన్న ఉద్దేశంతో తాత్కాలికంగా మాత్రమే సీజ్ చేశామని కలెక్టర్ తెలిపారు.

ఆశావహుల్లో నైరాశ్యం

అంతా గందరగోళం

- బీసీ రిజర్వేషన్లపై స్టే ఇచ్చిన హైకోర్టు
- తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా
- స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నిలిపేసిన యంత్రాంగం
- నిరుత్సాహంలో అధికార పార్టీ శ్రేణులు
- ఎక్కడి పనులు అక్కడే..



నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఖాళీగా కూర్చున్న నామినేషన్ల స్వీకరణ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడింది. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. అంతేకాదు గురువారం ఉదయమే నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అయితే బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైన సంగతి తెలిసిందే. దానిపై బుధవారం విచారణ జరిపిన కోర్టు గురువారం మధ్యాహ్నం విచారణ అనంతరం స్టే ఇచ్చింది. నాలుగు వారాల పాటు విచారణను వాయిదా వేసింది. దీంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. అయితే గురువారం ఉదయం నోటిఫికేషన్ తరువాత నామినేషన్ల ప్రారంభం కాగా, ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ గందరగోళంగా మారింది.

మొదటి నుంచి ఎన్నికలపై అనుమానాలే..

ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పూనుకున్నప్పటి నుంచి ఎన్నికలు జరుగుతాయా లేదా అనే దానిపై అనుమానాలు నెలకొన్నాయి. బీసీలకు రిజర్వేషన్లను పెంచడానికి ఉన్న చట్టబద్ధతపైనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. రాజ్యాంగం ప్రకారం 50 శాతం మించి రిజర్వేషన్లు ఉండటానికి అవకాశం లేదన్న చర్చ జరిగింది. ప్రభుత్వం బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంతో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు కలిపితే అవి 50 శాతానికి మించి ఉండడంతో ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే ఇచ్చింది.

ఎంపీటీసీ స్థానాలకు రెండు నామినేషన్లు

స్థానిక సంస్థల మొదటి విడత ఎన్నికల్లో భాగంగా నల్లగొండ, దేవరకొండ డివిజన్ల పరిధిలోని 18 జెడ్పీటీసీ, 196 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసి, అధికారులు నామినేషన్లను స్వీకరించారు. దీంతో కనగల్ మండలం జీ ఎడవల్లి ఎంపీటీసీ స్థానానికి ఒక్కరు, నార్కట్‌పల్లి మండలం నార్కట్‌పల్లి-1 ఎంపీటీసీ స్థానానికి మరొకరు నామినేషన్లు దాఖలు చేశారు.

నాలుగు వారాల వాయిదాతో ఆగిపోయిన ఎన్నికల ప్రక్రియ

హైకోర్టు గురువారం మధ్యాహ్నం తర్వాత ఎన్నికల ప్రక్రియపై స్టే ఇచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అందడంతో జిల్లా యంత్రాంగం ఎన్నికల ప్రక్రియను నిలిపివేసింది.

నిరాశలో అధికార పార్టీ శ్రేణులు, ఆశావహులు

ప్రస్తుత పరిస్థితులతో ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ కేడర్ అంతా నైరాశ్యంలో పడింది. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బలంగా చెబుతోంది. అందుకు ప్రత్యేక జీవోను జారీచేసింది. దానికి అనుగుణంగా ఎన్నికల కమిషన్ షెడ్యూల్, నోటిఫికేషన్లను జారీ చేసింది. రిజర్వేషన్ల పెంపుపై హైకోర్టు స్టే ఇవ్వడంతో ఆశావహులు నిరాశలో పడ్డారు. ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం పోటీ చేసే ఆశావహులంతా ఆయా గ్రామాల్లో పోటీకి సిద్ధం అయ్యాయి. ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కొందరైతే గురువారం నామినేషన్లు కూడా వేశారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి.. ఇప్పుడు బీసీలకు పంచిన రిజర్వేషన్లు ఉంటాయా.. ఉండవా.. లేదంటే పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలను నిర్వహిస్తారా? అన్న దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుత రిజర్వేషన్ల కారణంగా పోటీ చేసే అవకాశం లేకుండా పోయిన వారు కొంత ఆనందంలో ఉంటే ప్రస్తుతం రిజర్వేషన్ల ప్రకారం పోటీకి సిద్ధమైన వారికి నిరాశకు గురయ్యారు. నాలుగు వారాల తుదుపరి విచారణ వరకు ప్రభుత్వం ఆగుతుందా? దానిపై ప్రభుత్వం ఎలా ముందుకు సాగుతుంది..? ప్రభుత్వ పరంగా కాకుండా, కేవలం పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళుతుందా? లేదంటే పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లేందుకు చర్యలు చేపడుతుందా? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

మందకొడిగా మద్యం టెండర్లు

- పెరిగిన డిపాజిట్ ధరతో దరఖాస్తుదారుల వెనుకడుగు
- 14 రోజులు గడిచినా 74 దరఖాస్తులే..
- మిగిలింది తొమ్మిది రోజుల గడువే

నల్లగొండ: మద్యం టెండర్ల దరఖాస్తులు మందకొడిగా సాగుతున్నాయి. రెండేళ్ల కాల పరిమితితో జిల్లాలో 154 కొత్త మద్యం దుకాణాల నిర్వహణకు ఎక్సైజ్ శాఖ గతనెల 26న టెండర్లను ఆహ్వానిస్తు నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుల స్వీకరణకు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంతోపాటు రామ్‌నగర్‌లోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం, హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో కూడా దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. ఈ మూడు చోట్ల కలిపి మొత్తం గురువారం నాటికి కేవలం 74 మందే దరఖాస్తులు సమర్పించారు.

డిపాజిట్ ధర పెరగడంతో ఆసక్తి చూపట్లే..

గతంలో మద్యం టెండర్లలో పాల్గొనాలంటే దరఖాస్తుకు రూ.2 లక్షల డిపాజిట్ చెల్లించాల్సి ఉండేది. అయితే ఈసారి దాన్ని రూ.3 లక్షలకు పెంచడంతో టెండర్లు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఒక్కరే టెండర్ వేస్తే షాపు రాకపోతే రూ.3 లక్షలు కోల్పోవాల్సి వస్తుందని, లక్కీగా టెండర్ రాకపోతే నష్టపోకుండా ఇద్దరు నుంచి ఆరుగురు వరకు కలిసి తలా కొన్ని డబ్బులు వేసుకుని టెండర్లు వేసే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో టెండర్ దరఖాస్తుల ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

మిగిలింది తొమ్మిది రోజులు మాత్రమే..

మద్యం టెండర్ల ప్రక్రియ ప్రారంభమై 14 రోజులు గడిచిపోయింది. ఇక టెండర్లు వేసేందుకు కేవలం తొమ్మిది రోజుల గడువే ఉంది. అయితే ఈ నెల 18వ తేదీ గడువులోగా టెండర్లు వేగం చేసేందుకు అధికారులు కూడా వ్యాపారులను మోటివేట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం డిపాజిట్ ధర పెంచడంతో కొందరు వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ నేథప్యంలో ఎక్కువ మంది కలిసి ఒక టెండర్‌ను వేసే ధోరణిలో ఆలో ఆలోచిస్తున్నారు.

ఇదిలా ఉంటే కొందరు మంచి రోజులు లేవనే కారణంతో వేచి చూసే ధోరణిలో ఉన్నారు. చివరి 3 రోజులు మంచి రోజులు ఉన్నాయని ఆ రోజుల్లో టెండర్లు వేసేందుకు ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది.

లాజిక్‌తోను ఆలస్యంగా..

టెండర్ ఫామ్‌లు ముందుగా సమర్పిస్తే డబ్బాలో అడుగు భాగంలో పడిపోయి డ్రా తీసే సమయంలో మిక్స్ కాకపోతే డ్రా వెళ్లదని లాజిక్‌తో ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో చివరి రోజుల్లో వేస్తే డబ్బాలో తమ టెండర్లు పైన ఉండి డ్రా తీసేటప్పుడు తమ పేరు వచ్చే అవకాశాలు ఉంటుదని భావిస్తున్నారు. దీంతో టెండర్లు ఆలస్యంగా జరుగుతున్నాయని సమాచారం.

సబ్‌స్టేషన్ చుట్టూ వర్షపునీరు



తిప్పర్తి : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తిప్పర్తి మండల కేంద్రంలోని 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ చుట్టూ వర్షపునీరు చేరింది. తిప్పర్తి మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సబ్‌స్టేషన్ ఎదుట కల్వర్టు నిర్మించకపోవడంతో పాత కల్వర్టుల నుంచి నీరు సాఫీగా వెళ్లకుండా సబ్‌స్టేషన్‌లోకి చేరిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ డ్రామా పోటీలు



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



బహుమతులు అందజేస్తున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ: నల్లగొండలోని డైట్ కళాశాలలో గురువారం నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను డీఈఓ భిక్షపతి ప్రారంభించి మాట్లాడుతూ సైన్స్ డ్రామాలు శాస్త్ర సాంకేతికతను ప్రజల్లోకి తీసుకెళతాయన్నారు. సైన్స్‌లో మహిళల పాత్ర, స్మార్ట్ వ్యవసాయం, డిజిటల్ ఇండియా, పరిశుభ్రత, గ్రీన్‌టెక్నాలజి అంశాలపై విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు ఆలోచింపజేశాయి. ఈ పోటీల్లో ఆర్పీ రోడ్డులోని ప్రభుత్వ బాలికల పాఠశాల నల్లగొండ ప్రథమ స్థానం, సెయింట్ ఆన్స్ హైస్కూల్ నకిరేకల్‌కు ద్వితీయ స్థానం, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఇఎస్ బాలికల స్కూల్ నకిరేకల్ 3వ స్థానం పొందాయి. విజేతలకు డీఈఓ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వేణుగోపాల్, సాదియా పరహీన్, తస్లీమ్ ఫాతిమా, వనం లక్ష్మీపతి పాల్గొన్నారు.

నేడు జిల్లా బంద్

నల్లగొండ టౌన్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు శుక్రవారం నల్లగొండ జిల్లా బంద్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బంద్‌కు అన్ని వ్యాపార, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు సహకరించాలనికోరారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై ఆరా

- కలెక్టర్‌తో చర్చించిన స్థానిక ఎన్నికల జిల్లా పరిశీలకురాలు కొర్ర లక్ష్మి



కలెక్టర్ ఇలా త్రిపాఠితో సమావేశమైన కొర్ర లక్ష్మి

నల్లగొండ, రామగిరి(నల్లగొండ): నల్లగొండ కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో గురువారం స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి సమావేశమయ్యారు. తొలి విడత ఎన్నికలు జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల నోటిఫికేషన్, నామినేషన్ల ఏర్పాట్లపై చర్చించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కగా అమలు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. అనంతరం ఆమె నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాట్లు, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వివరాలను జిల్లా కలెక్టర్ ఆమెకు వివరించారు. మొదటి విడతగా నల్లగొండ, దేవరకొండ డివిజన్లలోని 18 మండలాలు, 196 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ జారీ చేశామని, నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు విధులను ప్రారంభించాయన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా జిల్లా ఎస్పీ ద్వారా భద్రతా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఆమెకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ వై.అశోక్‌రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి రాజ్‌కుమార్, జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, డీపీఓ వెంకయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

కనగల్: నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని స్థానిక ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం వారు కనగల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందికి వారు పలు సూచనలు చేశారు. మొదటి రోజు జీ.యడవల్లి ఎంపీటీసీ స్థానానికి ఒక్కటే నామినేషన్ వచ్చిందని అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి కె.సుమలత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వారివెంట జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, డీపీఓ కె.వెంకయ్య, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి ఉన్నారు.

బాలాజీ అరెస్ట్‌కు రంగం సిద్ధం

- అధిక వడ్డీ ఆశచూపి అమాయకుల నుంచి రూ.కోట్లు కొట్టేసిన బాలాజీ నాయక్
- తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుల ఆందోళన
- అప్పు ఇచ్చిన వారిలో ఒకరి ఆత్మహత్య నేపథ్యంలో కేసు నమోదు
- ఆస్తులు జప్తు చేసేలా రెవెన్యూ శాఖకు పోలీసుల లేఖ



పలుగుతండాలో బాలాజీ ఇంటి వద్ద బాధితుల ఆందోళన (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అధిక వడ్డీకి ఆశ పడి మోసపోయిన వారి ఆందోళనలు ఓవైపు.. డబ్బులు ఇచ్చినా సకాలంలో తమకు తిరిగి చెల్లించకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న పలుగుతండా వాసి ఘటన మరోవైపు.. వెరసి బాలాజీ నాయక్‌పై పోలీసులు ఉచ్చు బిగిస్తున్నారు. పీఏపల్లి మండలం పలుగుతండాకు చెందిన బాలాజీ నాయక్ అధిక వడ్డీ ఆశచూపి అమాయక ప్రజల నుంచి రూ.కోట్లు తీసుకొని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుండడంతో ప్రజలు ఆందోళనకు దిగారు. ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరొకరు ఆత్మహత్యకు యత్నించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1999 ప్రకారంతోపాటు ప్రజల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిన బాలాజీ నాయక్‌ను అరెస్టు చేసేందుకు సిద్ధం అయ్యారు. అయితే అతను పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. మరోవైపు అతని పేరున ఏమేం ఆస్తులు ఉన్నాయి.. ఎక్కడెక్కడ ఉన్నాయన్న వివరాలను సేకరించి, వాటిని జప్తు చేయాలని రెవెన్యూ శాఖను కోరారు. దీంతో వారు రంగంలోకి దిగారు.

దేవరకొండ ప్రజల పేరుతో గతంలోనే ఫిర్యాదు

అధిక వడ్డీ ఆశ చూపి ప్రజలను మోసం చేశాడంటూ బాలాజీ నాయక్‌పై గత జూన్‌లోనే దేవరకొండ ప్రజల పేరుతో ఒక ఫిర్యాదు వచ్చింది. వ్యక్తిగతంగా ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా పోలీసులు అతన్ని పిలిపించి విచారణ జరిపారు. మూడు నెలల్లో చెల్లిస్తానని చెప్పడంతో వదిలేశారు. ఈనెల 7న పలుగుతండాకు చెందిన సరియా తాను ఇచ్చిన రూ.20 లక్షల డబ్బులను బాలాజీ తిరిగి ఇవ్వడం లేదని పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నించి చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. ఇది తెలిసి గ్రామానికి చెందిన బాధితులు గ్రామంలోని బాలాజీ నాయక్ ఇంటిపై దాడికి దిగారు. ఇంటిముందున్న కారును తగులబెట్టారు. మరోవైపు బుధవారం మిర్యాలగూడ, నేరడుచర్లలోని అతని బంధువుల ఇళ్ల ముందు ఆందోళనకు దిగారు. తాజాగా గురువారం లోక్యా అనే వ్యక్తి కూడా పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ నేపథ్యంలో పోలీసులు బాలాజీ నాయక్‌ను అరెస్టుకు రంగం సిద్ధం చేశారు.

ఆత్మహత్యలు సరికాదు

పెద్దఅడిశర్లపల్లి : అధిక వడ్డీ బాధితులు ఆత్మహత్యకు పాల్పడడం సరికాదని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు సూచించారు. బాధితులెవరూ ఆందోళన చెందొద్దని, నేరుగా తమ వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి, డబ్బులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఆశచూపి.. రూ.కోట్లు వసూలు చేసి..

అమాయక ప్రజలను అధిక వడ్డీ ఆశచూపి నమ్మించాడు. రూ.వందకు రూ.10 నుంచి రూ.16ల వరకు వడ్డీ ఇస్తానని నమ్మబలికి వారి నుంచి రూ.వందల కోట్లు వసూలు చేశాడు. ముందుగా బంధువుల వద్ద అప్పులు తీసుకొని, వారికి ప్రతీనెల వడ్డీ చెల్లించాడు. అది ఆ నోటా ఈ నోటా గ్రామం, మండలం, జిల్లానే కాదు ఇతర జిల్లాలకు వ్యాపించింది. దీంతో అధిక వడ్డీ కోసం అనేక మంది తమ ఇళ్లు, భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి మరీ అతనికి అప్పులు ఇచ్చారు. మొదట్లో తనతోపాటు ఒకరిద్దరిని మాత్రమే కలుపుకొని అధిక వడ్డీ పేరుతో దందా ప్రారంభించి, ఆ తరువాత 15 మంది ఏజెంట్లను నియమించుకొని మరీ కొనసాగించాడు. ఇలా దేవరకొండ, నల్లగొండ, నాగార్జున సాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్‌తోపాటు, రంగారెడ్డి జిల్లాలోనూ వసూళ్లు చేశారు. 16 బ్యాంకు అకౌంట్ల ద్వారా వేల మంది నుంచి రూ.వందల కోట్ల దందా కొనసాగించాడు. అయితే మొదట్లో అప్పులు ఇచ్చిన వారికి వడ్డీ చెప్పినట్లుగానే చెల్లించినా, అసలు ఇవ్వకపోవడంతో ఆందోళన మొదలైంది. దీంతో దేవరకొండ ప్రాంత పబ్లిక్ ఫ్రాడ్ అవేర్‌నెస్ గ్రూపు పేరుతో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి గత జూన్ నెలలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు కలెక్టర్ పంపించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి విచారించారు. ఇక అప్పటి నుంచి బాలాజీ నాయక్ తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో మంగళవారం సరియా ఆత్మహత్య చేసుకోగా, గురువారం మరొకరు ఆత్మహత్యకు యత్నించగా, అతనికి అప్పులు ఇచ్చిన మిగితా వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

ఎడమకాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మునగాల: మునగాల మండల పరిధిలోని బరాఖత్‌గూడెం శివారులో గురువారం సాగర్ ఎడమకాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కాలువ వద్దకు చేరుకొని మృతదేహాన్ని వెలికితీసినట్లు తెలిపారు. అతడి వయస్సు 40–45ఏళ్ల మధ్య ఉండవచ్చని తెలిపారు. మృతదేహం ఆచూకీ నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచామని, వివరాలకు 87126 86048, 96666 92085 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట..

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పట్టణ పోలీసులు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు ఉంటుందని, ఆకుపచ్చ–నలుపు రంగు టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మునగాల: మండలంలోని కృష్ణానగర్ గ్రామ శివారులో గల సాగర్ ఎడమకాలువ(పాలేరు)లో బుధవారం గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం ఖమ్మం జిల్లా పాలేరు జలాశయంలో లభ్యమైంది. నడిగూడెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్ గ్రామానికి చెందని భుక్యా బాబునాయక్(42) బుధవారం అయ్యప్ప మాల స్వీకరించాడు. అదే రోజు సాయంత్రం స్నానమాచరించేందుకు మిగతా మాలధారులతో కలిసి సాగర్ ఎడమకాలువ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో స్నానం చేస్తుండగా భుక్యా బాబునాయక్ ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయి వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. గురువారం పాలేరు జలాశయంలో అతడి మృతదేహం కనిపించింది. మృతుడి కుమారుడు భుక్యా భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నడిగూడెం పోలీసుల కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తిప్పర్తి: తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతిచెందినట్లు రైల్వే ఎస్సై రామకృష్ణ గురువారం తెలిపారు. సుమారు 50సంవత్సరాల వయసు గల వ్యక్తి ఈనెల 8న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పార్వతిపురం వరకు టికెట్ తీసుకున్నాడని, మిగిలిన ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. నల్లగొండ స్టేషన్ మాస్టర్ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పత్తి తీసేందుకు వెళ్లిన మహిళా కూలీ అదృశ్యం


పఠాన్ జానిబేగం

నడిగూడెం : పత్తి తీసేందుకు వెళ్లిన మహిళా కూలీ ఈ నెల 7న అదృశ్యమైంది. స్థానిక ఎస్ఐ గండమళ్ల అజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన పఠాన్ జానిబేగం (38) ఈనెల 7న తమ గ్రామానికి చెందిన తోటి కూలీలతో కలిసి ఆటోలో ఖమ్మం జిల్లా కూసుమంచి ప్రాంతంలో పత్తి తీసేందుకు వెళ్లింది. తర్వాత జానిబేగం ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త పఠాన్ జాఫర్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

‘నెల్లికల్లు’ పనులు ముమ్మరం


సాగర్ జలాశయ తీరంలో ఏర్పాటు చేసిన ఇన్‌టేక్ వెల్

- కొనసాగుతున్న పంప్‌హౌస్ స్లాబ్ సెంట్రింగ్ పనులు
- ఆరునెలల్లో ఒక పంపుతోనైనా నీరు పోయించాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు


పంప్‌హౌస్ స్లాబ్‌ల కోసం కొనసాగుతున్న సెంట్రింగ్ పనులు

నాగార్జునసాగర్: సాగర తీరంలోని బండలక్వారీ సమీపంలో మూడేళ్ల క్రితం మొదలైన నెల్లికల్లు ఎత్తిపోతల పనులు తిరిగి కొనసాగుతున్నాయి. ఆరునెలల్లో ఒక పంపుతోనైనా నీరు పోయించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఇంజనీర్లు తెలిపారు. గత రెండేళ్లుగా జూలై నుంచి సుమారుగా డిసెంబర్ వరకు జలాశయంలో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరువలోనే ఉండటంతో పనులకు కొంత మేర అంతరాయం కలిగింది. జలాశయంలో నీరు తగ్గుముఖం పట్టిన సమయంలో పనులు జోరందుకుంటున్నాయి. జలాశయంలో 510 అడుగుల నీరు ఉన్నప్పుడు జలాశయ తీరంలో ఎత్తిపోతల పథకానికి నీరు తీసుకునే ప్రాంతంలో నీరుండదు. అందుకుగాను జలాశయ తీరంలో ప్రత్యేకంగా బావిని 35మీటర్ల లోతు తవ్వారు. జలాశయం లోపలి నుంచి అప్రోచ్ కెనాల్స్‌ను సుమారుగా 300 మీటర్లకు పైచిలుకే తవ్వడం పూర్తయింది. జలాశయంలోని నీరు బావిలోకి రాకుండా ఉండేందుకు బావి చుట్టూ కాంటూర్ బండ్ ఏర్పాటు చేశారు. బావిలోకి నీటి ఊట రాకుండా దరులకు కాంక్రీట్ చేశారు. దానిలో పంప్‌హౌస్‌ల ఏర్పాటు కోసం స్లాబులు వేసేందుకు సెంట్రింగ్ పనులు జరుగుతున్నాయి. జలాశయంలో నీరుండటంతో పంప్‌హౌస్‌లోకి నీటి జాలు వచ్చి చేరుతుందని, దీంతో నిత్యం డీవాటరింగ్ చేయాల్సి ఉంటుందని ఇంజనీర్లు తెలిపారు.

కొనసాగుతున్న పైప్‌లైన్ పనులు

సాగర తీరం నుంచి ఎర్రచెరువు వరకు పైప్‌లైన్ పనులు జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఎర్రచెరువుతండా నుంచి ఇరువైపులా పైపులైన్ వేస్తున్నారు. ఒక పైప్‌లైన్ గోడుమడక వైపు వెళ్తుండగా.. మరో పైప్‌లైన్ యల్లాపురం తండా వైపు వెళ్లనుంది. కొన్ని చోట్ల ఫారెస్ట్ అంతరాయం ఉండటంతో వాటికి క్లియరెన్స్‌లు కూడా వచ్చినట్లు ఇంజనీర్లు తెలిపారు.

24వేల ఎకరాలకు నీరందించే లక్ష్యం

సాగర్‌డ్యాం నిర్మాణ సమయంలోనే జలాశయ తీర ప్రాంతానికి సాగు నీరు ఇవ్వాలనే డిమాండ్ వచ్చింది. 70 ఏళ్లుగా ప్రజలు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ వచ్చారు. జలాశయం తీరప్రాంతంలో నెల్లికల్లు లిఫ్ట్ ఏర్పాటు చేసి వేలాది ఎకరాల బీడు భూములు సాగులోకి తీసుకురావడంతోపాటు తాగునీరు ఇవ్వాలని ఈ ప్రాంత రైతులు, గిరిజనులు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కోదాడలో నిర్వహించిన పార్టీ మీటింగ్‌లో నెల్లికల్లు లిఫ్ట్‌కు రూ.50కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. అదేవిధంగా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2021 ఫిబ్రవరి 10న నెల్లికల్లు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. సాగర్ జలాశయతీరం గిరిజన తండాల్లోని 24వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో లిఫ్ట్ పనులు ప్రారంభమయ్యాయి.

పాల నురగలా..


ఎత్తిపోతల నుంచి దిగువకు జాలువారుతున్న వరదనీరు

నాగార్జునసాగర్: భారీ వర్షాల కారణంగా నాగార్జున సాగర్ జలాశయం సమీపంలోని చంద్రవంక వాగుకు వరద పోటెత్తుతోంది. ఈ నీరంతా సాగర్ నుంచి మాచర్ల కు వెళ్లే మార్గంలో ఎత్తిపోతల వద్ద 70 అడుగుల మీద నుంచి దిగువకు పాల నురగలా దుముకుతున్న ప్రకృతి అందాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి.

ఏసీబీకి చిక్కిన చిట్యాల తహసీల్దార్

- ల్యాండ్ మ్యుటేషన్, ఇన్‌స్పెక్షన్ రిపోర్టు ఇచ్చేందుకు రూ.10లక్షలు డిమాండ్
- రూ.2లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు


ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్ కృష్ణ, రమేష్

చిట్యాల: ల్యాండ్ మ్యుటేషన్, ఇన్‌స్పెక్షన్ రిపోర్టు ఇచ్చేందుకుగాను నల్లగొండ జిల్లా చిట్యాల మండల తహసీల్దార్ గగులోతు కృష్ణ ఓ రియల్ ఎస్టేట్స్ సంస్థ ద్వారా లంచం తీసుకుంటుండగా గురువారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ ఏసీబీ డీఎస్పీ సీహెచ్. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం గుండ్రాంపల్లి రెవెన్యూ పరిధిలోని 172 సర్వే నంబర్‌కు సంబంధించి ల్యాండ్ మ్యుటేషన్, 167 సర్వే నంబర్‌పై ఇన్‌స్పెక్షన్ రిపోర్టు కోసం మెస్సర్స్ రత్న హౌసింగ్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఇటీవల తహసీల్దార్ గగులోతు కృష్ణను ఆశ్రయించింది. ఇందుకుగాను తహసీల్దార్ రూ.10లక్షలు డిమాండ్ చేయగా.. సంస్థ రూ.5లక్షలకు ఒప్పందం కుదుర్చుకుంది. ముందస్తుగా రూ.2లక్షలను ప్రైవేటు వ్యక్తి గట్టు రమేష్‌కు ఇవ్వాలని తహసీల్దార్ సూచించారు. ఈ విషయంపై సంస్థ ప్రతినిధులు ఫోన్ ద్వారా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం సంస్థ ప్రతినిధులు తహసీల్దార్ కార్యాలయం బయట రమేష్‌కు రూ.2లక్షలను అందజేస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదు రికవరీ చేయడంతోపాటు, రమేష్‌ను, తహసీల్దార్ కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. వీరిని నాంపల్లి ఏసీబీ కోర్టులో శుక్రవారం హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. హైదరాబాద్‌లోని తహసీల్దార్‌కు చెందిన ఇంటిలో కూడా సోదాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మైనింగ్ విషయంలోనూ ఆరోపణలు

తహసీల్దార్ కృష్ణపై మైనింగ్ విషయంలో ఆరోపణలు ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో తహసీల్దార్ కృష్ణ చిట్యాల మండలానికి వచ్చారు. వెలిమినేడు, పెద్దకాపర్తి పరిసర ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్నా పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా తన వ్యవసాయ క్షేత్రం వద్ద వేసిన షెడ్లు ప్రభుత్వ భూమిలో ఉన్నాయని పేర్కొంటూ వాటిని కూల్చివేయించి ఆస్తినష్టం కలిగించారని చిన్నకాపర్తికి చెందిన బోయపల్లి శ్రీనివాస్ తహసీల్దార్ కృష్ణపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

కంటైనర్ ఢీకొని హోంగార్డు దుర్మరణం


ఉపేంద్రాచారి (ఫైల్)

రామన్నపేట: విధి నిర్వహణలో ఉన్న హోంగార్డును కంటైనర్ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం తెల్లవారుఝామున రామన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన కూరెళ్ల ఉపేంద్రాచారి(35) రామన్నపేట పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం తెల్లవారుఝామున రామన్నపేట సుభాష్ సెంటర్‌లో అతడు మరో కానిస్టేబుల్‌తో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఉపేంద్రాచారి భువనగిరి నుంచి చిట్యాల వైపు వెళ్తున్న కంటైనర్‌ను ఆపే ప్రయత్నం చేశాడు. డ్రైవర్ ఆపకుండా వాహనాన్ని ముందుకు పోనివ్వడంతో హోంగార్డును ఢీ కొట్టింది. దీంతో అతడి తలభాగం పూర్తిగా ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హోంగార్డును ఢీకొట్టి అక్కడి నుంచి పరారైన కంటైనర్ డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఉపేంద్రాచారి మృతితో ఆస్పత్రి ఆవరణలో కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి.

హోంగార్డుకు ప్రముఖుల నివాళి

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డు కూరెళ్ల ఉపేంద్రాచారి మృతదేహాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్, అడ్మిన్ ఆర్ఐ శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా హోంగార్డు సంక్షేమ నిధి నుంచి తక్షణ సాయంగా రూ.10వేలు, భువనగిరి హెడ్‌క్వార్టర్స్ తరపున రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సీపీ సుధీర్‌బాబుకు ఫోన్‌చేసి ఉపేంద్రాచారి భార్యకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా ఉపేంద్రాచారి మృతదేహాన్ని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాగరాజు సందర్శించి నివాళులర్పించారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం


క్రీడాజ్యోతి వెలిగిస్తున్న రాంబాబు

నల్లగొండ టూటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని యాదాద్రి జోనల్ సంరక్షణ అధికారి శివాల రాంబాబు అన్నారు. గురువారం నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియంలో రీజనల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ – 2025 క్రీడాపోటీలను ఆయన క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి మహమ్మద్ అక్బర్ అలీ, ఏటీఆర్ సర్కిల్ సంరక్షణ అధికారి సునీల్ ఇరామత్, నల్లగొండ డీఎఫ్ఓ పెట్ల రాజశేఖర్, ఎఫ్‌డీఓ నాగభూషణం, ఎఫ్ఆర్ఓ వీరేంద్రబాబు, భువనగిరి, జోగులాంబ గద్వాల, నల్లగొండ సర్కిల్‌కు సంబంధించిన తొమ్మిది జిల్లాల ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఉత్సవాల లక్కీడ్రా విజేతకు ప్లాట్ రిజిస్ట్రేషన్


రాజుకు ప్లాట్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ అందజేస్తున్న దుర్గాకమిటీ నిర్వాహకులు

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలంలోని గౌస్‌కొండ గ్రామంలో శ్రీ శివరామ దుర్గాకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని లక్కీ డ్రా ఏర్పాటు చేశారు. ఈ నెల 3న నిర్వహించిన డ్రాలో చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన రూపాని రాజుకు 150 గజాల ప్లాట్ వరించింది. దాంతో గురువారం ఆ విజేతకు చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో 150 గజాల ప్లాటును రిజిస్ట్రేషన్ చేసి నిర్వాకులు డాక్యుమెంట్స్ అందజేశారు. ఈసందర్భంగా రాజు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ శ్రీశివరామ దుర్గాకమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రమోద్‌రెడ్డి, వెదిరె రాజిరెడ్డి, మర్రి నితిన్‌రెడ్డి, కల్లెం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద ఉధృతికి కూలిన పేరూర్ బ్రిడ్జి


కూలిపోయిన పేరూర్ బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద


బ్రిడ్జి వద్ద ఎస్ఐ సాయి ప్రశాంత్, పోలీస్ సిబ్బంది

హాలియా : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పేరూర్ బ్రిడ్జి కూలిపోయింది. సోమ సముద్రం చెరువు ఉధృతంగా ప్రవహించడంతో గురువారం రాత్రి వరద తాకిడికి సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి కొట్టుకుపోయింది. అనుముల మండలంలోని ఐదు గ్రామాల ప్రజలు ఈ వంతెన గుండా రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన కొట్టుకుపోవడంతో పేరూర్ గ్రామంతో పుల్లారెడ్డిగూడెం, వీర్లగడ్డతండా, ఆంజనేయ తండా గ్రామాలకు చెందిన ప్రజలు తిరుమలగిరి (సాగర్) మండల కేంద్రం గుండా హాలియాకు తమ ప్రయాణాలు కొనసాగించాల్సి వస్తోంది. స్థానిక ఎస్ఐ సాయి ప్రశాంత్ తన సిబ్బందితో కూలిన వంతెనను పరిశీలించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రహదారి సమస్యను పరిష్కరించడానికి హాలియా నుంచి రెండు వరుసల రహదారి తో పాటు నూతన వంతెన నిర్మాణానికి సుమారు రూ.కోటితో ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

లతీఫ్ ఉల్లా షా ఖాద్రీ ఉర్సు ప్రారంభం

- అట్టహాసంగా గంధం ఊరేగింపు


ఉస్మాన్‌పురలో పంఖా కార్యక్రమం ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ నవీన్‌కుమార్‌గౌడ్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రీ ఉర్సు గురువారం ప్రారంభమైంది. మొదటిరోజు పట్టణంలోని మదీనా మసీదు నుంచి గంధంను ఊరేగింపుతో ఉర్సు గుట్ట వద్దకు చేర్చారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఏఎస్పీ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ముతావలీలు గౌసుల్లా ఖాద్రీ, షమీ ఖాద్రీ, జమాల్ ఖాద్రీ, సల్మాన్‌ఖాద్రీ, తబ్రేజ్ ఖాద్రీ, ఉబేదుల్లా ఖాద్రీ, హాశం, ఇంతియాజ్, ఠాగూర్ పాల్గొన్నారు. ఉర్సు సందర్భంగా ఉస్మాన్‌పురలో మాజీ కౌన్సిలర్ మారగోని నవీన్‌కుమార్‌గౌడ్ పంఖా కార్యక్రమాన్ని ప్రారంభించారు.


గంధం తీసుకొస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐలు, ఎస్ఐలు


పాటలు పాడుతున్న పకీర్లు


గంధం ఊరేగింపులో కళాకారులు

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్ట్

తుర్కపల్లి: మండల పరిధిలో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు తుర్కపల్లి ఎస్ఐ మహమ్మద్ తఖీయుద్దీన్ తన సిబ్బందితో కలిసి గురువారం ముల్కలపల్లిలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో టాటా ఏస్ వాహనాన్ని ఆపి పరిశీలించారు. అందులో ఉన్న తుర్కపల్లి మండలం బిల్యాతండాకు చెందిన మడావత్ చరణ్, గుగులోత్ తరుణ్ వద్ద రెండు కవర్లలో మొత్తం 1.460 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితులు ఒడిశా రాష్ట్రంలోని కాగేష్ అనే వ్యక్తి వద్ద గంజాయి సేకరించి స్థానికంగా విక్రయిస్తున్నట్లు తేలింది. మడావత్ చరణ్, గుగులోత్ తరుణ్ వద్ద గంజాయి తోపాటు, టాటా ఏస్ వాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

చిలుకూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన చిలుకూరు మండల పరిధిలోని కవిత జూనియర్ కళాశాల వద్ద కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బేతవోలు గ్రామానికి చెందిన మాదార్ (33) సుతార్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య రహిమా మునగాల మండలం నరసింహాపురం గ్రామంలోని వారి బంధువుల ఇంటి వద్ద ఉండడంతో ఆమెను తీసుకువచ్చేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. మండల పరిధిలోని కవిత జూనియర్ కళాశాల ఆవరణం వద్ద రాగానే కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వస్తున్న కారు ఓవర్ టేక్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టడంతో మాదార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య రహిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పిడుగుపాటుకు 27 మేకలు, గొర్రెలు మృతి

కొండమల్లేపల్లి: దేవరకొండ మండల పరిధిలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వద్యతండాలో పిడుగుపాటుకు గుర్రె రాత్లావత్ శంకర్, రాత్లావత్ చందర్ అనే ఇద్దరు రైతులకు చెందిన 27 మేకలు, గొర్రెలు మృతి చెందాయి. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతులు అధికారులను కోరుతున్నారు.

WANTED
Wanted Principal, Accountant, Handwriting, Computer, High School English, Karate Teacher & Hostel Warden (Male) Contact
Gowtham Group Of School, Nalgonda
98482 26251, 99127 53000

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFICER
■ ఎటువంటి కమిషన్ లేకుండా, అన్ని రకాల లోన్లు తక్కువ టైంలో ఇప్పించబడును (సిబిల్ అవసరంలేదు).1L-5Cr వరకు తక్కువ వడ్డీ. సలహాలకై సంప్ర: 9492793930 [HA-15625]

Wanted
■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబి కేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051 [SCA25008728]

FACULTY TEACHERS
■ Wanted Teachers for Telugu, Hindi, English, Maths, Science. @ Damaracharla. Ph: 8008000361 [HA-16386]

సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740, 9010038110
కోదాడ : 9505508382
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

‘మిరప’లో తెగుళ్లను నివారిద్దాం

పాడి–పంట

పెద్దవూర: ప్రస్తుతం మిరప చేలు పక్వ దశలో ఉన్నాయి. అనేక చీడపీడలు వ్యాపించి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. శిలీంద్రాలు, పురుగులు, సూక్ష్మధాతువు లోపాలు ఉన్నట్లు దీనికి తోడు నల్లతామర పురుగులు వ్యాప్తి ఉంది. కొమ్మ ఎండు, కాయకుళ్లు, బూడిద తెగుళ్లు, కాయతొలిచే పురుగుల వల్ల పంట నష్టపోయే ప్రమాదం ఉంది. దీంతో నాణ్యత తగ్గి తాలుకాయలు ఏర్పడి మార్కెట్‌లో ఆశించిన మద్దతు ధర లభించదు. అందుకు గాను మిరప పంటలో సస్యరక్షణ పద్ధతులు పాటించి కాపాడుకోవాలని ఉద్యానవన క్లస్టర్ అధికారి మురళి రైతులకు సూచిస్తున్నారు.

కొమ్మ ఎండు, కాయకుళ్లు..

మిరప పైరు పూత దశ నుంచి కాయ దశకు వచ్చే సమయాల్లో కొమ్మ ఎండు తెగులు, కాయ కుళ్లు, తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. వీటి కారణంగా కొమ్మ, కాయపై బూడిద రంగు మచ్చలు ఏర్పడతాయి. వీటి ప్రభావంతో కొమ్మలు పైనుంచి కింది వరకు ఎండిపోతాయి. కాయ సహజ రంగును కోల్పోతుంది.



నివారణ చర్యలు

ఎకరానికి 200 లీటర్ల నీటిలో 200 మి.లీ ప్రొపికొనజోల్, లేదా 100 మి.లీ. డైఫెన్ కొనజోల్, లేదా 200 గ్రాముల పైరాక్సీ స్ట్రోబిన్‌ను కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగుళ్లు

చలి, తేమ వంటి వాతావరణం మార్పులతో బూడిద తెగులు సోకుతుంది. ఈ తెగుళ్లను కలిగించే శిలీంద్రంతో ఆకు కింది భాగంలో బూడిద రంగులో తెల్లటి పొడి ఏర్పడుతుంది. దీని వల్ల ఆకులు పసుపు రంగులోకి మారి రాలిపోతాయి.

నివారణ

ఎకరాకు 200 లీటర్ల నీటిలో 300 గ్రాముల గంధకం, లేదా 200 మి.లీ.ల డైనోకాప్, లేదా బెలటాన్, లేదా అజాక్సీస్ట్రోబిన్‌లను కలిపి పిచికారీ చేయాలి. లేదా లీటర్ నీటిలో 200 మి.లీ. ట్రైడిమార్ఫ్ కలిపి పిచికారీ చేయొచ్చు.

కాయ తొలిచే పురుగు

కాయ తొలిచే పురుగు కాయలను రంధ్రం చేసి లోపలి భాగాన్ని తినడం వల్ల కాయ రాలిపోవడం లేదా కాయ పరిమాణం తగ్గి నాణ్యత, దిగుబడి కోల్పోతుంది.

నివారణ

లీటర్ నీటిలో 1.5 గ్రాముల అసిఫేట్, లేదా ఒక మి.లీ నువులురాన్, లేదా 0.3 మి.లీ.ల రైనాక్సీఫైర్, లేదా 0.3 గ్రాముల ఫ్లూబెండమైడ్‌ను కలిపి పిచికారీ చేయాలి.

పక్షికన్ను మచ్చ తెగులు

తేమతో కూడిన చల్లటి వాతావరణంలో మిరప ఆకులపై సర్కోస్పోరా, ఆల్టర్‌నేరియా మచ్చలు ఆశిస్తాయి. సర్కోస్పోరా ఆశిస్తే పక్షికన్ను ఆకారం గల మచ్చలు ఏర్పడతాయి. ఈ ప్రభావంతో పంటలో నాణ్యత, రంగు తగ్గుతాయి.

నివారణ

200లీటర్ల నీటిలో 200 మి.లీ.ల ప్రొపికొనజోల్‌ను కలిపి ఎకరం పొలంలో పిచికారీ చేసుకోవాలి. లేదా 100మి.లీ.ల డైఫెన్‌కొనజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి.

జింకు లోపం

భాస్వరం ఎక్కువగా వాడితే జింకులోపం కనిపిస్తుంది. ఆకుల కనుపుల మధ్య పసుపు పచ్చ రంగులోకి మారి రాలిపోతుంది.

నివారణ

జింకులోపం నివారణకు లీటర్ నీటిలో 2 గ్రాముల చీలేటెడ్ జింక్‌ను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.